నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టీఎన్‌జీఓ కాలనీ, రంగారెడ్డి, కేంబ్రిడ్జి స్కూల్, అలయ్ బలయ్ చౌరస్తా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

◆ 11 కేవీ కాకోజీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెక్రటేరియట్ కాలనీ, అలయ్ బలయ్ చౌరస్తా, టీఎన్‌జీఓ కాలనీ, కాకోజీ ప్రాంతంలో విద్యుత్ ఉండదన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 30, పచ్చిమిర్చి 50 , బెండ 60, కాకర 60, దొండ 50, దోస 40, ఆలు 30, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

12న ఐటీ ఉద్యోగులకు అవగాహన

రాయదుర్గం: ఐటీ ఉద్యోగుల కోసం గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో జూలై 12వ తేదీన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. శాంతిసరోవర్ క్యాంపస్‌లోని ఇన్నర్‌స్పేస్‌లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'ఇన్నర్ ఎక్స్‌లెన్స్ రీట్రీట్' పేరిట 'ఒత్తిడి లేని జీవితాన్ని గడపడానికి మనస్సును పునఃప్రారంభించడం'పై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సమావేశంలో ముంబాయికి చెందిన అంతర్జాతీయ వక్త, కార్పొరేటర్ ట్రైనర్ బి.కె. శ్రేయ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

21న బోనాల పండుగ



పటాన్‌చెరు టౌన్: ఆషాఢ బోనాలను పటాన్‌చెరు పట్టణంలో జులై 21 వ తేదీ సోమవారం నిర్వహించేందుకు పట్టణ పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బోనాల పండుగ ఏర్పాట్లపై ఆదివారం ఉదయం పట్టణంలోని కోదండ సీతారామస్వామి ఆలయంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన పట్టణ పుర ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... 21వ తేదీన నిర్వహించనున్న బోనాల పండుగ సందర్భంగా ప్రభుత్వం తరపున అన్ని దేవాలయాల వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

డోవా కాలనీలో మురుగు సమస్య



మియాపూర్ డోవా కాలనీలో రోడ్డుపై మురుగునీరు

మియాపూర్: మియాపూర్ డివిజన్ డోవా కాలనీ రోడ్లపై మురుగునీరు చెరువును తలపిస్తుంది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దుర్వాసన భరించలేకపోతున్నామని దోమలు వృద్ధి చెంది అనారోగ్యంపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డులో వరద నీటి కాల్వ పనులు చేపట్టడంతో అక్కడ మురుగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి మురుగునీరంతా డోవా కాలనీలో రోడ్లపై నిలిచిపోతోంది. అధికారులు వరదనీటి కాల్వ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పీజేఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం

ఆల్విన్‌కాలనీ: గచ్చిబౌలి ఫ్లైవర్‌కు దివంగత కార్మికనేత జనార్దన్‌రెడ్డి పేరు పెట్టడం అభినందనీయమని నాయకులు అన్నారు. జగద్గిరిగుట్ట చౌరస్తా, ఆర్‌పీ కాలనీలో పీజేఆర్ విగ్రహానికి ఎస్ఎస్‌యూఐ శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సామ్, పీజేఆర్ అభిమానులు పీజేఆర్ విగ్రహానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు సాయికుమార్, లింగయ్య, బాషిపాక యాదగిరి, పరశురాం, యూత్ కాంగ్రెస్ నాయకులు అశోక్, శ్రావణ్, చరణ్, మణికంత తదితరులు పాల్గొన్నారు.



చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో ఫ్లాట్‌ఫారం మీద లిఫ్టు నిర్మాణం



రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన లిఫ్టు పనులు

మెట్లు ఎక్కలేక.. దిగలేక

చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌లో అసంపూర్తిగా లిఫ్టు నిర్మాణ పనులు

- ఫ్లాట్‌ఫారం దాటాలంటే ప్రయాణికులు, వృద్ధులు, వికలాంగుల అవస్థలు
- పార్కింగ్‌కు షెడ్డు లేక ఎండకు పాడవుతున్న వాహనాలు
- ఫ్లాట్‌ఫారం ఆవరణలో చెత్త చెదారం... పట్టించుకోని అధికారులు

చందానగర్: చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌లో గత సంవత్సరం ప్రారంభించిన లిఫ్టుల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి గచ్చిబౌలి, కొండాపూర్‌కు ఐటీ ఉద్యోగులు ఎంఎంటీఎస్ రైలులో నిత్యం రాకపోకలు చేస్తుంటారు. రైల్వేస్టేషన్‌లో వృద్ధులు, వికలాంగుల కోసం లిఫ్టులు ఏర్పాటునకు పనులు మొదలుపెట్టి అర్ధంతరంగా ఆపేయడంతో వృద్ధులు, మహిళలు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎక్కలేక రైలు పట్టాలు దాటుతున్నారు. ఈ ప్రమాదకర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని స్థానికులు లిఫ్టులు ఏర్పాటు చేయాలంటూ రైల్వే అధికారులకు వినతి పత్రాలు అందించారు. దీంతో రైల్వే ఉన్నతాధికారులు చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌లో రెండు లిఫ్టుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కొన్ని రోజులు పనులు చకచకా జరిగినప్పటికీ చివరిదశలో పనులు చేయకుండా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో ఫ్లాట్‌ఫారం ముందు చెత్త చెదారం

◆ అమృత్ భారత స్కీం కింద చందానగర్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి

◆ రైల్వే ఫ్లాట్ ఫారం వద్ద చెత్త చెదారం పేరుకుపోయింది.

◆ ద్విచక్ర వాహనాలు ఎండకు ఎండకుండా, వర్షంలో తడవకుండా షెడ్డు నిర్మించాలి

◆ రైల్వే స్టేషన్‌లో లిఫ్టు పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

◆ రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన స్వజల్ కౌంటర్‌ను స్టేషన్ బయట పెట్టారు. ప్రయాణికులకు అందుబాటులో ఏర్పాటు చేయాలి.

ఫ్లాట్‌ఫారాలు మారాలంటే తీవ్ర ఇబ్బందులు



ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో లిఫ్టు పనులు అసంపూర్తిగా ఉండడంతో ఫ్లాట్‌ఫారాలు మారాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే లిఫ్టులు అందుబాటులోకి తీసుకురావాలి.

–వి.ప్రభాకర్‌రావు, హుడా కాలనీ

పార్కింగ్ స్థలంలో షెడ్డు నిర్మించాలి



రైల్వే స్టేషన్ ముందు ఉన్న పార్కింగ్ స్థలంలో షెడ్డు నిర్మించాలి. ద్విచక్రవాహనాలు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పుపడుతున్నాయి. రైల్వే ఉన్నతాధికారులు స్పందించాలి.

– దశరథరామయ్య, హుడా కాలనీ



పార్కింగ్ స్థలంలో షెడ్డు లేక ఎండలోనే ద్విచక్ర వాహనాల పార్కింగ్

బోనాలను ఘనంగా నిర్వహిద్దాం

మణికొండ: ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని మణికొండ క్వార్టర్స్ ఉత్సవ కమిటీ నాయకులు తీర్మానించారు. ఆదివారం కాలనీలోని ఆలయం వద్ద నిర్వహించిన సమావేశంలో బోనాల ఉత్సవాల ఏర్పాట్ల గురించి చర్చించారు. గతేడాది కంటే ఈసారి మరింత వైభవంగా బోనాలను నిర్వహించాలని తీర్మానించారు.

మాస్కులు ధరించి..

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని సుమిత్రనగర్‌లో ఆదివారం ప్రధాని మోదీ పాలనపై అవగాహన కల్పించారు. ప్రధానిగా 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలన, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. వంశీరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని బొమ్మల మాస్కులను ధరించారు.

భవనంపై నుంచి దూకి మహిళ ఆత్మహత్య

చందానగర్: భవనంపై నుంచి దూకిన ఓ గృహిణి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు... ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళంకు చెందిన బురుడ ప్రసాదరావు, పాల కొండకుమారి (33) దంపతులు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రసాదరావు కుటుంబంతో కలిసి చందానగర్ పాపిరెడ్డి కాలనీలోని ఆరంభ టౌన్‌షిప్‌లో నివాసముంటున్నారు. అయితే గత మూడు సంవత్సరాల నుంచి కుమారి మానసికంగా బాధపడుతుంది. ఈనెల 28వ తేదీ శనివారం రాత్రి ఆకస్మాత్తుగా ఇంటిపైకి ఎక్కి కిందకు దూకింది. తీవ్ర గాయాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి తండ్రి పాలకొండ ఫాల్గుణరావు ఆదివారం చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కాలనీల సమగ్రాభివృద్ధికి సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల సమగ్రాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తూ న్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడ బీహెచ్‌ఈఎల్ మెట్రో ఎన్‌క్లేవ్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో మరో 70 లక్షల రూపాయలు కేటాయించి నిర్మాణాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 20 కాలనీలలో ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా మంచి నీరు అందిస్తున్నామని.. మిగిలిన కాలనీల ప్రజల కోసం త్వరలోనే పైపు లైన్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. నూతన కమ్యూనిటీ హాల్లో ఫ్లోరింగ్ నిర్మాణ పనులకు సొంత నిధులు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, సీనియర్ నాయకులు సత్యనారాయణ, జ్ఞానేశ్వర్, రాజు, కృష్ణ, శ్రీకాంత్, మల్లేష్, బీహెచ్‌ఈఎల్ యూనియన్ ప్రతినిధులు రెహమాన్, దామోదర రెడ్డి, మల్లేష్, మల్లికార్జున గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ప్రతి ఒక్కరూ పొదుపు అలవాటు చేసుకోవాలి

రాజేంద్రనగర్: ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మార్కండేయనగర్ కాలనీకి చెందిన శ్రీ సత్యసాయి పొదుపు సంఘం 25వ వార్షికోత్సవం శివరాంపల్లి ప్రజాభవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..పొదుపు సంఘాలతో ప్రజలు ఎంతో వృద్ధి చెందుతున్నారన్నారు. 25 ఏళ్ల నుంచి సంఘం అభివృద్ధికి పాటుపడిన గద్దె యాదగిరి, పగిడిమర్రి సూర్యనారాయణ, ఏర్వ సత్యనారాయణ,గద్దె కృష్ణ, పగిడిమర్రి వాసు, కోటశ్యామ్ ఇతర పాలకవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్, లక్ష్మీనారాయణ, జయప్రకాష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



రాయదుర్గం: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని తొలి ఆదివారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాయదుర్గం శ్యామ్లేట్ వీధిలోని ఊరపోచమ్మ ఆలయంలో ఆషాఢమాసం ప్రతి ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

హెచ్‌సీయూలో 1వ తేదీ డాక్టర్స్ డే

రాయదుర్గం: 'డాక్టర్స్ డే'ను పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామియాదవ్ తెలిపారు. క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు పాల్గొంటారని, అలాగే అపోలో ఆస్పత్రుల డిపార్ట్‌మెంట్ ఆఫ్ నెఫ్రాలజీ హెడ్ డాక్టర్ రవి ఆండ్రూస్ పాల్గొంటారని తెలిపారు.

ఆకట్టుకున్న కథక్, భరతనాట్య ప్రదర్శనలు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కథక్, భరతనాట్య ప్రదర్శనలతో అలరించారు. పూణే నుంచి వచ్చిన కథక్ కళాకారిణి నేహాదాంలే ప్రదర్శనలో గణేశా వందన, తాల్‌ధమార్, మ్యూజిక్ అంశాలను ప్రదర్శించారు. అంజు అరవింద్ శిష్యబృందం అలరిపు, పుష్పాంజలి, జతిస్వరం, అంబస్తుతి, కావడి చిందు, అర్ధనారీశ్వర అష్టకం, ముద్దుగారే యశోద, తిల్లాన తదితర అంశాలను కళాకారులు శిఖ, అద్రిత, ఆశ్రిత, మానస, సాద్వి, కృత్విక, నేత్ర, సమర, దియా, మైత్రి, ఎంలీన్, అమూల్య, అక్షిత ప్రదర్శించారు.





వ్యక్తి అదృశ్యం



మియాపూర్: ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగిరాని సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మాతృశ్రీనగర్ కాలనీ, గోల్డెన్ హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఎ.దేవకుమార్(40) భార్య సునీతతో కలిసి నివాసముంటున్నాడు. సునీత ఊరికి వెళ్లగా దేవకుమార్ ఒక్కడే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వెళ్లిపోతున్నానని మళ్లీ తిరిగి రానని తన స్నేహితుడు వంశీకృష్ణతో పాటు మరో కొంతమంది స్నేహితులకు ఆదివారం ఉదయం 5 గంటలకు మేసేజ్ చేశాడు. ఇంట్లో కూడా అమ్మూ ఐ లవ్ యూ సో మచ్ అండ్ ఐ యామ్ రియలీ సో సారీ అని రాసి పెట్టి ఇంటినుండి వెళ్లిపోయాడు. దీంతో ఆందోళన చెందిన స్నేహితుడు వంశీకృష్ణ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా ఈ వ్యక్తిని గుర్తించినట్లయితే మియాపూర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

బీజేపీ మన్ కీ బాత్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలో ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలసి ఆమె వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. నాయకులు వెంకట్ రెడ్డి, మల్లేష్, కిష్టన్న, లక్ష్మణ్ గౌడ్ , కృష్ణమూర్తి, శేఖర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, బసమ్మ, రాజేశ్వరి, పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు... పాదచారికి దారేది..?

శంషాబాద్: ఫుట్‌పాత్ ఆక్రమణలతో పాదచారికి దారి లేకుండా పోతోంది. నడవడానికి స్థలం లేకపోవడంతో రోడ్డుపై నడక అనివార్యంగా మారింది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. 15 రోజుల కిందట సాతంరాయిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న చిరువ్యాపారాలకు సంబంధించిన డబ్బాలు తొలగించాలని ఉన్నతాధికారుల నుంచి అందిన ఆదేశాలను అధికారులు క్షణాల్లో ఆచరించారు. పోలీసుల సహకారంతో డబ్బాలను తొలగించారు. నాలాను ఆనుకుని ఆక్రమణలున్న కారణంగానే ఫిర్యాదులు అందగానే వాటిని తొలగించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

కౌన్సిల్‌లో తీర్మానాలు చేసినా..

శంషాబాద్ పట్టణంలో ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతున్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు ఏడేళ్లుగా ఒక్కసారి కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గతంలో అనేకమార్లు ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు కౌన్సిల్‌లో తీర్మానాలు చేసినా అవి కార్యాచరణకు నోచుకున్న దాఖలాలు కూడా లేవు. రోడ్డును ఆక్రమించి హోటళ్లు, వ్యాపారాలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదు.

అద్దెకిచ్చేస్తున్నారు...

ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొందరు సొంత వ్యాపారాలను విస్తరిస్తుండగా మరికొందరు తమ దుకాణాల ముందు స్థలాన్ని చిరువ్యాపారులకు అద్దెకిస్తున్నారు. పట్టణంలోని రాళ్లగూడ రహదారిలో ఫిరంగి నాలాను ఆనుకుని పదుల సంఖ్యలో డబ్బాలను ఏర్పాటు చేసి అద్దెలకిచ్చేస్తున్నారని ఆరోపణలు వెలువడుతున్నాయి. కానీ దీనిపై ఇంతవరకు మున్సిపాలిటీ అధికారుల చర్యలు నిల్. ఫుట్‌పాత్‌ల ఆక్రమణ కారణంగా సాధారణ ప్రజలతో పాటు ప్రయాణికులు సైతం నిత్యం నరకం చూస్తున్నారు. రద్దీలేని సాతంరాయిలో పెద్దసార్ల ఆదేశాలతో ఆగమేఘాల మీద ఆక్రమణలు తొలగించిన అధికారులు అదే రీతిన పట్టణంలో ఉన్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



హైవే ఫుట్‌పాత్‌పై కంటైనర్ హోటల్ నిర్వహణ



రాళ్లగూడ రహదారిలో ఫుట్‌పాత్‌ల పై సామగ్రి అమ్మకం

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగిస్తాం..

పట్టణంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఉన్న కట్టడాలు, డబ్బాలను తప్పకుండా తొలగిస్తాం. రహదారులను ఆక్రమించి ఉంటే కఠినంగా చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు ఎవరివైనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ, ఏడవ ఫేజ్‌లోని ఆలయంలో ఆదివారం రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ విచ్చేసి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గంధం రాజు, నళిని కాంత్, శివ చౌదరి, రమణ, గోవిందు, వాసు తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలింపు ఇలాగేనా...











- ఫైకప్పు లేకుండా చెత్తను తీసుకెళుతున్న ఆటోలు
- రోడ్లపై పడుతున్న చెత్త.. దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానికులు



మియాపూర్: జీహెచ్ఎంసీ చెత్త ఆటోలు పైకప్పు లేకుండా వెళ్తుండడంతో చెత్త రోడ్లపై పడి దుర్వాసన వెదజల్లుతుందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్లు అపరిశుభ్రంగా తయారవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలో సుమారు వందకు పైగా ఆటోలు వివిధ కాలనీల నుండి చెత్తను తీసుకువచ్చి దీప్తిశ్రీనగర్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో డంప్ చేస్తారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి లారీల ద్వారా చెత్తను తెస్తుంటారు. ఈ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నుండి జవహర్‌నగర్‌లో ఉన్న డంపింగ్ యార్డ్‌కు పెద్ద లారీలలో చెత్తను తీసుకువెళ్తుంటారు. ఈ ఆటోలు ఎక్కువగా చందానగర్ ప్రధాన రహదారి నుంచి మదీనాగూడలోని దీప్తీశ్రీనగర్ కాలనీ నుండి వెళ్తుంటారు. కాగా దీప్తిశ్రీనగర్‌లో ధర్మపురి టెంపుల్ రోడ్డు గుంతలమయంగా మారడంతో ఆ రోడ్డు వెంబడి చెత్త ఆటోల నుండి చెత్త కిందపడుతుంది. వెనుక వస్తున్న వాహనదారులపై పడుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త ఆటోలు పైకప్పుతో వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.